## సమాచారం

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**కుత్బుల్లాపూర్:** విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎన్‌సీఎల్, బాలాజీ ఫీడర్ల పరిధిలోని అంగడిపేట్ గ్రామం, టవర్ లైన్ రోడ్డు, శ్రీనీ గేట్ 1, 2, 3, లయన్ పార్కు, కాస్ హోటల్ బిల్డింగ్, కాంటన్ పార్కు మెయిన్ రోడ్డు, కేవీఆర్ ఫంక్షన్‌హాలు లేన్, విజయశాంతి ఎన్‌క్లేవ్, శివరెడ్డి గొడౌన్స్, ప్రజెయ్ అపార్ట్‌మెంట్స్, మనభూమి ఎన్‌క్లేవ్, వెన్‌సాయి అపార్ట్‌మెంట్స్ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు..

◆ అదే విధంగా సెయింట్ ఆన్స్, వెన్‌సాయి ఫీడర్ల పరిధిలోని జయభేరి గార్డెన్ సొసైటీ పార్క్, కేవీఆర్ ఏరియా, సెయింట్ ఆన్స్ స్కూల్ రోడ్డు, పాంటలూన్స్ షోరూమ్, కాంటన్ పార్కు 1, 2, ఆల్వాల్ బోర్డర్ ఏరియా, ఎన్‌సీఎల్ సౌత్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**క్రషల్ ఫీడర్ పరిధిలో..**

**సుభాష్‌నగర్:** క్రషల్ ఫీడర్ పరిధిలోని ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, అదే విధంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గాజులరామారం గ్రామం, శివసాయిహిల్స్, జెఎస్ఎన్ యుఆర్ఎం, దేవేందర్‌నగర్, ఆర్‌వీఎస్ఆర్ నగర్, కైసర్‌నగర్, వీనస్ రాక్ హైట్స్, సాబేర్‌నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని గాజులరామారం ఏఈ సత్యనారాయణ తెలిపారు.

**బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...**

**నిజాంపేట్:** వికాస్, కృష్ణజ హిల్స్ ఫీడర్లు పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... అదే విధంగా వోల్వా ఫీడర్ పరిధిలో జీవికా అపార్ట్‌మెంట్స్, కోకకోలా చౌరస్తా నుండి వోల్వా సర్వీస్ సెంటర్ వరకు ఉన్న ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శాంతకుమార్ తెలిపారు.

## క్లుప్తంగా...

### ముగిసిన కట్ట మైసమ్మ, ఎల్లమ్మ జాతర

**సుభాష్‌నగర్:** సూరారంలో ఐదు రోజులుగా జరుగుతున్న కట్ట మైసమ్మ, ఎల్లమ్మ జాతర బుధవారం జరిగిన అన్నదానంతో ముగిసింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం ప్రారంభమైన అన్నదాన కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**బాలయ్యనగర్‌లో..**

బాలయ్యనగర్‌లో జరిగిన ఎల్లమ్మ జాతరలో భాగంగా బుధవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాని కార్పొరేటర్ రావుల శేషగిరి ముఖ్యఅతిథి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్తీ అధ్యక్షుడు నాగేష్ పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.

### ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

**కుత్బుల్లాపూర్:** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబానగర్ కాలనీలో కొనసాగుతున్న కంటివెలుగు కేంద్రాన్ని బుధవారం మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు రావల్‌కోల్ మంగమ్మ సందర్శించారు. ఈ సందర్భగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మంగమ్మ మాట్లాడుతూ.. ప్రజల కంటి సమస్యలను దూరం చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

### ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

**జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్ట కొండపై శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని మల్లన్న ఆలయాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జా చెరలో చిక్కుకుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ స్థలాన్ని పరిరక్షించాలని బుధవారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ స్థలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి 1500 గజాల స్థలాన్ని కబ్జాదారులు అక్రమించి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

### విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

**దుండిగల్:** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మలోని శ్రీశ్లోక స్కూల్ 6వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... తల్లిదండ్రులు తమ పిల్లలతో గడిపేందుకు తప్పకుండా కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. మొబైల్స్ ఫోన్లకు బానిసలు కాకుండా పుస్తక పఠనం, క్రీడలు ఆడితే పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్న స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఆంజనేయులును అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ వెంకటరెడ్డి, దుండిగల్ సీఐ రమణారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



# కొంపల్లిలో శ్రీలీల సందడి



**సాక్షి, సిటీబ్యూరో:** టాలీవుడ్‌లో వరుస హిట్‌లతో దూసుకుపోతున్న యువ సినీతార శ్రీలీల బుధవారం కొంపల్లిలో సందడి చేసింది. కొంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ఫర్నిచర్ స్టోర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత తరుణంలో ప్రజలు సౌకర్యవంతమైన జీవన విధానాన్ని కోరుకుంటున్నారని అన్నారు. సంస్థ చైర్మన్ విజయ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. అమెరికా, ఇటలీ, వియత్నాం, టర్కీ, జర్మనీ, మలేషియా తదితర అంతర్జాతీయ ఉత్పత్తులను అందుబాటులో తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ మదన్ సుబ్రమణ్యం, ప్రద్యుమ్న కరణం, సురేష్, ప్రశాంత్, కోటియన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన క్రీడోత్సవం

**సుభాష్‌నగర్:** దూలపల్లిలో తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో రెండు రోజులుగా జరుగుతున్న అటవీ శాఖ అధికారుల రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో చార్మినార్, భద్రాద్రి, రాజన్న, యాదాద్రి, జోగులాంబ, బాసర, కాళేశ్వరం అటవీ సర్కిళ్లకు చెందిన అధికారులు పాల్గొని రన్నింగ్, లాంగ్ జంప్, వెయిట్ లిఫ్టింగ్, డిస్కస్ త్రో, క్యారమ్స్, చెస్, రైఫిల్ షూటింగ్, బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ తదితర క్రీడాశాల్లో పోటీ పడ్డారు. విజేతలుగా నిలిచిన వారికి అటవీ ప్రధాన సంరక్షణాధికారి మోహన్ చంద్ర పర్గెయిన్ ముఖ్యఅతిథిగా హాజరై మెడల్స్‌తో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. అటవీ అకాడమీ సంచాలకులు ఎల్యూసింగ్ మేరు, అటవీ శాఖ ఉన్నతాధికారులు వినయ్‌కుమార్, చంద్రశేఖరరెడ్డి, సోనీబాలాదేవి, వినోద్‌కుమార్, రమేశ్, సైదులు, భీమానాయక్, శివాని డోగ్రా తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి మోసపూరిత హామీలు

## హాత్ సే హాత్ జోడోలో కొలన్ హన్మంతరెడ్డి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి మోసపూరిత హామీలని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయనగర్, పద్మానగర్ రింగ్‌రోడ్డు, వాజ్‌పేయినగర్, సంజీవ్‌నగర్, బాపునగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో 'హాత్ సే హాత్ జోడో' కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ జెండాలను హన్మంతరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడపగడపకు హాత్ సే హాత్ జోడో స్టిక్కర్లను అతికించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ఆనంద్‌రావు, ఏ-బ్లాక్ సెక్రటరీ బాలయ్య, ఎక్స్ వార్డ్‌మెంబెర్ ఎండీ జాకీర్, జెస్సీపాల్, హఫీజ్, ఆగమయ్య, సిద్దయ్య, ఈశ్వర్, బాల రాజు, సంగమ్మ, వనజ తదితరులు పాల్గొన్నారు. –కుత్బుల్లాపూర్

# బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్



సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో బంజారాల సంప్రదాయ వేషధారణలో ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు



జయంతి వేడుకల పూజల్లో పాల్గొన్న కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శంకర్‌నాయక్ తదితరులు



సంత్ సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ బాలాజీ నాయక్



సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**దుండిగల్:** సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను బుధవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని తాండ-1, 2లలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బంజారాలకు సంత్ సేవాలాల్ మహరాజ్ ఆరాధ్య దైవమని అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శంకర్‌నాయక్, 27వ వార్డు అధ్యక్షుడు అమర్‌సింగ్, బావాలాల్ మహరాజ్, నాయకులు రవీందర్ నాయక్, భీమ్‌సింగ్, ఆకుల ప్రభాకర్‌గుప్తా, మోహన్ నాయక్, హనుమంత్ నాయక్, తిరుపతినాయక్, రెడ్యానాయక్, ప్రేమ్‌సింగ్‌నాయక్, నగేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో...**

**నిజాంపేట్:** సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో బంజారాలు నిర్వహించిన వేడుకలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బంజారాల ఆరాధ్య దైవంగా భావించే సంత్ సేవాలాల్ మహరాజ్ హిందూ ధర్మం ప్రాముఖ్యతను తెలిపిన మహనీయుడని కొనియాడారు. కార్పొరేటర్ బాలాజీ నాయక్, నాయకులు జగదీష్, ముత్యాలు, రవీందర్ నాయక్, రాంచందర్ నాయక్, రవి నాయక్, పండు నాయక్, సామ్య నాయక్, శివనాయక్, శంకర్ నాయక్, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

**సూరారంకాలనీలో..**

**సుభాష్‌నగర్:** సూరారంకాలనీ శ్రీదుర్గామాత ఆలయంలో బుధవారం సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవాలాల్ మహరాజ్ కమిటీ ప్రెసిడెంట్ తారాసింగ్ నాయక్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బైండ్ల రాము, నాయకులు మనపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వరదనీటి కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలి

**కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత**

**కుత్బుల్లాపూర్:** నాలాల అభివృద్ధి పథకంలో భాగంగా నిర్మిస్తున్న వరదనీటి కాలువ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని... ఎక్కడైనా అడ్డంకులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని... అభివృద్ధి పనులను అడ్డుకుంటే మాత్రం ఊరుకునే సమస్య లేదని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత హెచ్చరించారు. గతేడాది భారీ వర్షాలతో కాలనీలు, మురికివాడ ప్రాంతాలు జలమయమైన విషయం తెలిసిందే. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రజలు పడ్డ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నాలాల అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

◆ 2022 సంవత్సరానికి గాను ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా రూ.97 కోట్లతో మూడు చోట్ల ప్రతిపాదనలు చేశారు. 6.5 కిలోమీటర్ల మేర వరద నీటి కాలువ నిర్మాణం కోసం శ్రీకారం చుట్టి పనులు వేగవంతం చేస్తూ వచ్చారు.

◆ పేట్‌బషీరాబాద్ నుంచి ఎన్‌సీఎల్ మీదుగా మీనాక్షి నుండి వెన్నెలగడ్డలోని ఎన్నా చెరువు వరకు ఇరిగేషన్ శాఖ అధికారులు నాలా ప్లాన్ రూపొందించి సుమారు 2.49 కిలోమీటర్ల మేర కోర్ కాలువకు సంబంధించిన ఇరువైపులా వరద నీటి నాలా పనులు వేగవంతం చేశారు.



మీనాక్షి ఎస్టేట్స్‌లో ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలిస్తున్న జెడ్‌సీ మమత, ఎస్ఈ చిన్నారెడ్డి

◆ ఇప్పటి వరకు 95 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అందులో భాగంగా బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత, ఎస్ఈ చిన్నారెడ్డితో కలిసి కుత్బుల్లాపూర్ ప్రాంతంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

◆ వారం రోజుల్లో నాలా పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. గతంలో మీనాక్షి సమీపంలో ప్రైవేటు స్థలం తమకు చెందిందంటూ కొంతమంది ఇబ్బందులు సృష్టించిన విషయంపై పూర్తి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం



ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

**ఘనంగా మాజీ ఎంపీ ధర్మభిక్ష జయంతి**

**జగద్గిరిగుట్ట:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ ధర్మ భిక్షం జయంతిని బుధవారం మగ్దూంనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుత్బుల్లాపూర్ మండల సీపీఐ కార్యదర్శి ఉమామహేష్, సహాయ కార్యదర్శి దుర్గయ్య మాట్లాడుతూ... ధర్మభిక్షం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతరం ఉద్యమాన్ని నడిపిన వీరుడన్నారు. స్వతంత్ర పోరాటంలో జైలుకు వెళ్లడంతో పాటు తెలంగాణ సాయుధ ఉద్యమానికి నాయకత్వం వహించారని కొనియాడారు. విద్యార్థుల కోసం భిక్షం అడుక్కుంటూ హాస్టల్ స్థాపించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ పేద విద్యార్థులకు విద్యను కల్పించడం వల్లనే ఆయనకు ధర్మభిక్షం అని పేరు వచ్చిందన్నారు.

◆ పార్లమెంట్ ఎన్నికల్లో 200 మందికి పైగా పోటీ చేస్తే ప్రజలు ధర్మభిక్షానికే ఓటు వేసి గెలిపించారని గుర్తు చేశారు. అది ఆయన గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో కల్లు గీత కార్మికుల కోసం సహకార సంఘాల ఏర్పాటు.. తాటి వనాల పెంపకం, ప్రమాదానికి గురైతే ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని పోరాటం చేసి సాధించిన పెట్టిన ఘనత ధర్మభిక్షానికే చెందుతుందన్నారు. నేడు పార్టీలకు అతీతంగా గౌడ కులస్తులు ఆయనను స్మరించుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన చివరి వరకు కమ్యూనిస్టుగానే ఉండి ప్రజాసేవ చేశారని తెలిపారు.

◆ మగ్దూమ్‌నగర్ శాఖ కార్యదర్శి సుధాకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళ సమాఖ్య మండల కార్యదర్శి హైమావతి, సత్యవతి, ఏఐవైఎఫ్ అధ్యక్షుడు సంతోష్, సదానాథ్, కృష్ణ, శివ, వరుణ్, నరేంద్రచారి, చంద్రయ్య, యాదగిరి, సందీప్, సాయులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సినర్జెమ్ కంపెనీతో ఎంఎల్ఆర్ఐటీ ఒప్పందం



సినర్జెమ్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకున్న ఎంఎల్ఆర్ఐటీ యాజమాన్యం

**దుండిగల్:** దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాల యాజమాన్యం సినర్జెమ్ కంపెనీతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సినర్జెమ్ సీఈవో విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు, ఎంఎల్ఐటీ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, మెకానికల్ హెచ్ఓడీ వెంకటేశ్వరరెడ్డి, ఏరోనాటికల్ హెచ్ఓడీ డాక్టర్ సత్యనారాయణ గుప్తా ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు.

◆ ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... వెల్డింగ్, ఎన్‌డీటీ టెక్నాలజీస్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేయడం ద్వారా మెకానికల్, ఏరోనాటికల్ విభాగాలను మెరుగుపరచడానికి ఎంఓయూ దోహద పడుతుందన్నారు. పరిశ్రమ పరిజ్ఞానం, అంతర్జాతీయ ధ్రువపత్రాలను పొందడంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు సహాయం చేస్తుందన్నారు.

◆ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ఉమ్మడి పరిశోధన ప్రాజెక్ట్‌లు, ఇంటర్న్‌షిప్‌లకు అవకాశాలను కలిస్తుందన్నారు. విద్యార్థులు వివిధ తయారీ పరిశ్రమలలో అనుభవాన్ని పొందడానికి కంపెనీ ఉద్యోగులతో కలిసి పని చేయవచ్చన్నారు. దీంతో విద్యార్థులు తమ సాంకేతికను, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోగలరని పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ వైఖరిని అడ్డుకుంటాం

**నిజాంపేట్:** మనుస్మృతిని పాఠ్యాంశాల్లో చేర్చడాన్ని నిరసిస్తూ బుధవారం బాచుపల్లిలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలపీరు మా ట్లాడుతూ.. మనుస్మృతిని పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా ప్రజల్లో ఐక్యత దెబ్బతింటుందన్నారు. కులాలుగా, మతాలుగా మరింత చీలికలు వచ్చే అవకాశముందన్నారు. భారత రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో మార్చడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని కేవీపీఎస్ అడ్డుకుంటోందని స్పష్టం చేశారు. మల్లికార్జున్, భాస్కర్, చంద్రప్ప, నరసింహా, శ్రీను, సమ్మయ్య పాల్గొన్నారు.

## యువతిపై వీధి కుక్కల దాడి



**కుత్బుల్లాపూర్:** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల దాడిలో మరో యువతి గాయపడింది. ఎన్‌సీఎల్ నార్త్ కాలనీకి చెందిన బీటెక్ చదువుతున్న భార్గవి (18) యువతిని బుధవారం ఉదయం కళాశాలకు వెళ్తుండగా వీధి కుక్కలు వెంబడించి దాడి చేశాయి. యువతి కాలికి గాయం కావడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టినప్పటికీ వీధికుక్కల బెడద తొలగలేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీధి కుక్కలను తరలించేందుకు సూపర్‌వైజర్‌ను నియమించి వాటిని తరలించాలని బీజేపీ నాయకుడు శివాజీరాజు కోరారు.

# చున్నీతో ఉరిబిగించి భర్త హత్య

- ఎవరికీ అనుమానం రాకుండా పథకం
- మృతదేహాన్ని సంచిలో ఉంచి ఇంటి బయట పడేసిన వైనం
- పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించిన భార్య
- ఆమెతో పాటు హత్యకు సహకరించిన బాలిక రిమాండ్

**జీడిమెట్ల:** భర్తను చున్నీతో ఉరిబిగించి హతమార్చిన భార్యను సహకరించిన బాలికను జీడిమెట్ల పోలీసులు బుధవారం రిమాండుకు తరలించారు. సీఐ పవన్ వివరాల ప్రకారం.. సంజయ్‌గాంధీనగర్‌లో నివాసముండే సంతోష్(28), అతని భార్య రేణుక(24)లు 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. సురేష్ ఆటో నడుపుతుండగా రేణుక ఇంట్లోనే ఉండేది. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెళ్లయిన సంవత్సరం తర్వాత రేణుక చెడు వ్యసనాలకు బానిసయ్యింది. రేణుక తరచూ కల్లు దుకాణానికి వెళ్లేది. అక్కడ రేణుకకు దుండిగల్ తాండాకు చెందిన బాలిక(17) పరిచయం అయ్యింది. ఆమెను తనతో పాటు ఇంటికి తీసుకువచ్చి తనతో పాటే అక్కడే ఉంచుకుంది.



నిందితురాలు రేణుక

◆ ఈనెల 6వ తేదీన రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. రేణుక చేసే కొన్ని పనులకు సురేష్ అడ్డు చెప్పేవాడు. దీంతో రేణుక ఎలాగైన భర్త సురేష్‌ను అడ్డు తొలగించుకోవాలని పథకం వేసింది. అదే రోజు రాత్రి రేణుక, భర్త సురేష్, బాలికలు పూటుగా మద్యం సేవించారు. మత్తులోకి జారుకున్న సురేష్ మెడకు చున్నీ బిగించి బాలిక సహాయంతో హత్య చేసింది.

◆ అనంతరం ఏమి తెలియనట్లు సురేష్ మృతదేహాన్ని సంచిలో ఉంచి ఇంటి బయట పడేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణలో భార్య రేణుక, బాలిక కలిసి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. బుధవారం రేణుక, బాలికను రిమాండ్‌కు తరలించారు.

## శుభాకాంక్షలు

**దుండిగల్:** శాసన మండలి ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును బుధవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జెమ్మి దేవేందర్ ఆధ్వర్యంలో శంభీపూర్ రాజును శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు, సీఐ లు రమణారెడ్డి, సైదులు, పవన్ కలిశారు.



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు జెమ్మి దేవేందర్

# ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి

**చింతల్:** ఐడీపీఎల్ క్వార్టర్స్ నుంచి రిటైర్డ్ ఐడీపీఎల్ ఉద్యోగుల కుటుంబాలను ఖాళీ చేయాలని జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఐడీపీఎల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఢిల్లీలోని కేంద్ర రసాయన, ఎరువుల సంయుక్త కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2003లో వీఆర్ఎస్ తీసుకున్న తమ నుంచి రూ.లక్ష మొదలుకుని రూ.2 లక్షలు డిపాజిట్ తీసుకుని నెలనెలా అద్దె చెల్లించే పద్ధతితో క్వార్టర్స్‌ను కేటాయించారని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉంటున్న తమను వెంటనే ఖాళీ చేయమంటే ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర్వులను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు వికానందమ్‌గౌడ్, యాదగిరి, బాలయ్య, పెరుమాళ్, ఫతూలాల్, వాడివల్, కుమార స్వామి, సరోజిని, శ్రీహరి, జె.స్వామి తదితరులు ఉన్నారు.



కేంద్ర రసాయన, ఎరువుల సంయుక్త కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న ఐడీపీఎల్ కాలనీవాసులు

# పాఠశాలకు నీటి సరఫరాను పునరుద్ధరించాలి

**సుభాష్‌నగర్:** విద్యార్థులు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుంటే ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి శివ అన్నారు. బుధవారం కైసర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జలమండలి మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ... గతేడాది ఆగస్టులో పాఠశాలకు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. దీనిపై స్పందించిన జలమండలి మేనేజర్ రెండు, మూడు రోజుల్లో నీటిని పంపిస్తామని చెప్పారు. ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు వరుణ్, మనోజ్, సందీప్, శివ, సాయిలు, నవీన్, పూర్ణ, హర్ష, ఆనంద్, మనోహర్ పాల్గొన్నారు.



జలమండలి మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు